క్లుప్తంగా

మండల స్థాయి షటిల్ పోటీలు

నాతవరం : మండల కేంద్రంలో వచ్చే నెల 3వ తేదీన జరగనున్న కోటమ్మ తల్లి పండగ సందర్భంగా మండల స్థాయి షటిల్ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లుగా నాతవరం ఉప సర్పంచ్ వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు కరక అప్పలరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దివంగత నేత వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అంకం రెడ్డి జమీలు సైన్యం ఆధ్వర్యంలో ఈ షటిల్ పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోటీలు ఈనెల 30వ తేదీ నుంచి వచ్చె నెల 1వ తేదీ వరకు జరుగుతాయన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.6వేలు, రెండో బహుమతి రూ.4వేలు, మూడో బహుమతి రూ.2వేలు నగదుతో పాటు షీల్డు ప్రదానం చేస్తామన్నారు.

అదనపు విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణకు రాయితీ

చోడవరం : అదనపు లోడ్ వినియోగించే విద్యుత్ వినియోగదారులకు 50 శాతం రాయితీపై లోడ్ క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అంతా వినిగించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ చోడవరం రూరల్ ఏఈ ఉదయ్‌కుమార్ కోరారు. ఒక కిలోవాట్‌కి రూ.1250, రెండు కిలోవాట్స్‌కి రూ. 2450, మూడు కిలోవాట్స్ రూ. 3650 , నాలుగు కిలో వాట్స్‌కి 4850, ఐదు కిలో వాట్స్‌కి రూ. 6050చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదనపు లోడ్ క్రమబద్ధీకరించుకునే వినియోగదారులు విద్యుత్ కార్యాలయం, మీసేవలో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

చెరువులను తలపించేలా ప్రభుత్వ కార్యాలయాలు



ఎంపీడీవో కార్యాలయం ముందు వర్షం నీరు

నాతవరం : మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ప్రభుత్వ కార్యాలయాలు జలమయం అయ్యాయి. ఎంపీడీవో కార్యాలయం నుంచి బయటకు రాలేనంత విధంగా చెరువుని తలపించేలా నీరు చేరింది. తహసీల్దార్, వెలుగు, వ్యవసాయశాఖ కార్యాలయం ప్రాంగణమంతా నీటితో నిండిపోవడంతో ఆయా కార్యాలయాలో పని చేసే వివిధ శాఖల అధికారులు సాయంత్రం విధులు ముగించుకుని వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పల్లపు ప్రాంతాలను మట్టితో ఎత్తు చేసి నీరు నిల్వ లేకుండా చేయాలని కోరుతున్నారు.

గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు



వి.సంతపాలెంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు : పీహెచ్‌సీల ద్వారా గర్భిణులకు మెరుగైన వైద్యం లభిస్తుందని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. వి.సంతపాలెం గ్రామంలో సోమవారం ఎఫ్‌పీసీ వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వారికి హెచ్‌బీ పరీక్ష చేశారు. గర్భిణులు మెరుగైన పోషకాహారం తీసుకోవాలని, పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు జరుపుకోవాలని సూచించారు. 97 మందికి సాధారణ వైద్య తనిఖీలతో పాటు బీపీ, సుగర్ పరీక్షలు జరిపారు. ఉచితంగా మందులు అందజేశారు.

గ్రంథాలయాల్లో విజ్ఞానం నిక్షిప్తం

కె.కోటపాడు : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి పద్మావతి అన్నారు. శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సందర్శించడం ద్వారా విజ్ఞానదాయక విషయాలు తెలుసుకోవచ్చన్నారు. అలాగే ఉద్యోగార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



బేతపూడిలో అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

దేవరాపల్లి: రైవాడ పంచాయతీ శివారు బేతపూడిలో అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు తెల్లవార జాము నుంచి స్వామి వారిని దర్శించుకొని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన జరిపారు. మండల వ్యాప్తంగా భక్తజనం తరలివచ్చి స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. మహిళల కోలాట ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ ధర్మకర్త ధర్మారావు దంపతులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధంగా...!



రాతికట్టడం ఛిద్రమై బలహీనమైన కల్వర్ట్

కేఆర్ పేట-ఉగ్గినవలస కూడలి వద్ద కుంగుతున్న కల్వర్ట్ మీదుగా వెళుతున్న బస్సు

కె.కోటపాడు : కె.కోటపాడు మండలం నుంచి కొత్తవలస వెళ్లే మార్గంలో కృష్ణారాయుడిపేట-ఉగ్గినవలస కూడలి వద్ద ఆర్అండ్‌బీ కల్వర్ట్ రోజు రోజుకు కుంగుతోంది. నెల రోజుల క్రితం కల్వర్ట్‌పై గల తారురోడ్డు కుంగడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. రోడ్డుపై భాగం కుంగడం కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ప్రయాణాలు భీతిల్లుతున్నారు. ఈ కల్వర్ట్ కింద నుంచి రైవాడ జలాశయం నుంచి విశాఖ ప్రజలకు నీటి సరఫరా జరిగే కెనాల్ మార్గం ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు కూలేందుకు సిద్ధంగా ఉన్న ఆర్అండ్‌బీ కల్వర్ట్ పరిస్థితిని గుర్తించి ఎటువంటి మరమ్మతు చర్యలు లేదా కూలే సమయంలో ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేయకుండా కేవలం హెచ్చరిక బోర్డులతో సరిపెడుతున్నారని ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఆరోపిస్తున్నారు.

రెండు జిల్లాల ప్రజలకు ఆధారం

అనకాపల్లి జిల్లాకు చెందిన కె.కోటపాడు, దేవరాపల్లి మండలాలకు చెందిన ప్రజలతో పాటు విజయనగరం జిల్లాకు చెందిన వేపాడ మండలాలకు చెందిన ప్రజలకు, వాహనదారులు ప్రధానంగా ఈ మార్గం గుండానే విశాఖపట్నం, కొత్తవలస, విజయనగరం ప్రాంతాలకు వెళతారు. ప్రతిరోజూ ఈ కల్వర్ట్ మార్గం గుండానే వందల సంఖ్యలో ఆటోలు, బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ కల్వర్ట్ కూలితే ఆయా మండలాల ప్రజలకు రాకపోకలకు అవరోధం కలుగుతుంది. దీంతో దేవరాపల్లి, విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రత్యామ్నాయ మార్గాలలో అధిక సమయం వెచ్చించి ప్రయాణాలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

అధిక బరువుతో లారీల రాకపోకలు

కృష్ణారాయుడిపేట-ఉగ్గినవలస కూడలి వద్ద కుంగుతున్న ఆర్అండ్‌బీ కల్వర్ట్ పై నుంచి లారీలపై అధిక బరువుతో కూడిన మెటల్, రాయి రవాణా చేస్తున్నారు. దీంతో కల్వర్టు కుంగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వేపాడ మండలాలకు చెందిన స్టోన్ క్రషర్‌ల నుంచి లారీలపై రోజూ బండరాళ్ళను తరలించడం వల్ల కల్వర్ట్‌లు బలహీనపడి కుంగే పరిస్థితికి వచ్చిందని చెబుతున్నారు. లారీలపై అనుమతులకు మంచి బరువుతో ప్రయాణాలను చేయడం వల్ల రోడ్లు కూడా కూడా దెబ్బతింటున్నాయి. అధిక బరువుతో కె.కోటపాడు మండలం మీదుగా ప్రయాణిస్తున్న వాహనదారులపై మోటార్ వెహికల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కూలే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలి



కేఆర్‌పేట-ఉగ్గినవలస కూడలి వద్ద ఆర్అండ్‌బీ కల్వర్ట్ మార్గంలో రోడ్డు ఒక వైపు కుంగింది. దీంతో కుంగిన ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న ప్రాంతం వైపు బిక్కుబిక్కుమంటూ వాహనదారులు ప్రయాణాలను సాగిస్తున్నారు. ఈ ఒక్క మార్గం గుండానే దేవరాపల్లి, కె.కోటపాడు, కొత్తవలస, విజయనగరం ప్రాంతాలకు వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ అర్అండ్‌బీ కల్వర్ట్ కూలితే ప్రయాణాలు నిలిచే పరిస్థితులుంటాయి. అధికారులు ముందస్తు చర్యలతో కుంగిన చోట యుద్ధ ప్రాతిపాదికన మరమ్మతులు చేపట్టాలి. **– వంటాకు అప్పాజి,** సర్పంచ్, ఆనందపురం

మోదకొండమ్మ జాతరకు జోరుగా ఏర్పాట్లు



వెండి కవచం, బంగారు ఆభరణాలతో మోదకొండమ్మను అలంకరించిన దృశ్యం

మాడుగుల : వచ్చే నెల 3న మాడుగుల మోదకొండమ్మ పండగను పురస్కరించుకుని జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. కళ్ల మిరుమిట్లు గొలిపే విధంగా భారీ స్థాయిలో విద్యుత్ లైటింగ్‌కు, భారీ నేల వేషాలకు సెట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. సతకం పట్టు స్టేజీపై ఈ నెల 30వ తేదీన క్లాసికల్ డ్యాన్స్‌తో పాటు కోలాటాలు, ఈనెల 31న జానకీరామ్ తిరుపతి బృందంతో రేలా రేరేలా, జూన్1వ తేదీన హైదరాబాద్ వారి డ్యాన్స్ మస్తీడ్యాన్స్, 2వ తేదీన హైదరాబాద్‌వారి డ్యాన్స్ ఉత్సవ్, పండగ రోజు, 3వ తేదీన చింతామణి గయోపాఖ్యానం నాటకంతో పాటు చిత్ర విచిత్రమైన నేలవేషాలు, పలు డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఆలయానికి రంగులు అద్ది ఆకర్షణీయంగా తయారు చేశారు.

పీజీఆర్ఎస్‌లో 11 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ రామారావు

నర్సీపట్నం : సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో భూ సమస్యలు, ఇతర సమస్యలు మొత్తం 11 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ రామారావు తెలిపారు. ఆర్డీవో వి.వి.రమణ ఫీల్డ్ విజిట్‌కు వెళ్లడంతో నర్సీపట్నం తహసీల్దార్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ధర్మసాగరం రెవెన్యూ పరిధి సర్వే నంబరు 18/1లో ఉన్న భూమిని ప్రసాద్ ఆక్రమించాడని, ఆక్రమణదారుడుపై చర్యలు తీసుకుని తన భూమిని అప్పగించాలని కోటవురట్ల మండలం, యండపల్లి గ్రామానికి చెందిన గుడివాడ అప్పలనాయుడు అర్జీ చేసుకున్నాడు. నాతవరం మండలం, గుమ్మిడికొండ గ్రామంలోని సర్వే నంబరు 102-20లో ఉన్న సుమారు 1-25 సెంట్లు ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోలేదని, కబ్జాకు గురవుతున్న భూమిని పరీక్షించి, ప్రజా అవసరాలకు వినియోగించాలని గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు పాప, సన్యాసినాయుడు ఫిర్యాదు చేశారు. ఈ రకమైన సమస్యలు సుమారు 11 వచ్చాయి. వీటిని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారిస్తానని తహసీల్దార్ అర్జీదారులకు హామీ ఇచ్చారు.

ఖరీఫ్ కల్లా తాండవ కాలువ పూడికతీత



పూడికతీత పనులపై వివరాలు తెలుపుతున్న ఏపీవో కొండాజీ

నాతవరం : ఖరీఫ్ సీజన్‌కు నీరు విడుదల చేసే సమయానికి తాండవ కాలువలో పూడికతీత పనులు పూర్తి చేస్తామని ఉపాధి హామీ పథకం ఏపీవో దాసరి కొండాజీ అన్నారు. మండల కేంద్రంలో గల ఇరిగేషన్ కార్యాలయంలో తాండవ ఆయకట్టు నీటి సంఘాలు అధ్యక్షులు ప్రాజెక్టు అధికారులతో సోమవారం ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ సమావేశం ఏర్పాటు చేశారు. తాండవ ప్రాజెక్టుకు సంబంధించి పలు అంశాలపై నీటి సంఘాల అధ్యక్షులు అధికారులతో చైర్మన్ చర్చించారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో కాలువలో ఇంతవరకు తీసిన పూడికతీత పనుల వివరాలను ఉపాధి హామీ పథకం ఏపీవో కొండాజీ తెలిపారు. మిగతా పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు తాండవ ప్రాజెక్టు దిగువనున్న ఖాళీ ప్రదేశంలో ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ జేఈ శ్యామ్‌కుమార్ నీటి సంఘాల అధ్యక్షుడు, రైతులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాల పరిశీలన



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ అనంత ఉమాదేవి, సర్పంచ్ జగన్

దేవరాపల్లి : గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ అనంత ఉమాదేవి సూచించారు. ఎం.అలమండ, ఎ.కొత్తపల్లి, పెదనందిపల్లి, చిన నందిపల్లి గ్రామాలలో చెత్త సంపద కేంద్రాలను సోమవారం ఆమె పరిశీలించారు. సంపద కేంద్రాలలో సేంద్రియ ఎరువులు తయారు చేసేలా చర్యలు చేపట్టాలని స్థానిక పంచాయతీ కార్యదర్శులకు ఆమె సూచించారు. సంపద తయారీ కేంద్రాల్లో పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని హరిత రాయబారులకు సూచించారు. ఎం.అలమండ సర్పంచ్ దాడి జగన్, పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



చినసోంపురంలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభిస్తున్న తామరబ్బ సర్పంచ్ రామకృష్ణ

దేవరాపల్లి : తామరబ్బ పంచాయతీ పరిధిలోని చినసోంపురం, పల్లపుకోడాబు గ్రామాల్లో సుమారు రూ. 4 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు సర్పంచ్ టోకురి రామకృష్ణ తెలిపారు. చినసోంపురం గ్రామంలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన స్థానికులతో కలిసి భూమి పూజ చేశారు. వీటిలో రూ. 3 లక్షలు మండల పరిషత్ నిధులు, రూ.లక్ష పంచాయితీ నిధులు కేటాయించినట్టు తెలిపారు. చినసోంపురంలో మండల పరిషత్ నిధులు రూ.లక్ష వ్యయంతో, పల్లపుకోడాబు మండల పరిషత్ నిధులు రూ, 2 లక్షలు, పంచాయితీ నిధులు రూ.లక్షతో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు చేసిన ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మికి, స్థానిక ఎంపీటీసీ బండి గౌరమ్మకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గుమ్మడపు మహేష్, దాకమర్రి శివాజీ, ఎం.చంటి, వార్డు మెంబర్ ముక్కు కన్నబాబు, కడారి రాజు, సిరగం దాలిబాబు, మాసాల ఈశ్వరరావు పాల్గొన్నారు.

రాయితీపై పశువుల దాణా సిద్ధం



పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ, ఏడీఏ

రావికమతం : రావికమతం ప్రాంతీయ పశువైద్యశాల వద్ద సోమవారం పాడి రైతులకు పశువుల దాణా 50 శాతం రాయితీపై పశు దాణా పంపిణీ చేశారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు వేపాడ లక్ష్మీనాగేశ్వరరావు, ఏడీఏ టి.పుష్ప రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఏ పుష్ప మాట్లాడుతూ 50 శాతం రాయితీపై 340 బస్తాలు సిద్ధంగా ఉన్నాయని, దీనిని రావికమతం, రోలుగుంట మండలాల పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పుష్ప తెలిపారు. 50 కిలోల పశువుల దాణా బస్తా ధర రూ.1100 కాగా 50 శాతం రాయితీపై రూ.550కు రైతులకు అందజేస్తున్నట్టు చెప్పారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

నాతవరం: రాజుపేట అగ్రహారం గ్రామంలో సోమవారం ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఈఏడాది హనుమాన్ జయంతి సందర్భంగా పూజా కార్యక్రమాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆ రోజున భారీ వర్షం కావడంతో అన్నదానం వాయిదా వేశారు. ఆంజనేయస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. సర్పంచ్ గుడపర్తి అచ్చియ్యనాయుడు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఆలయంలో భజనలు ఏర్పాటు చేశారు.

హామీలు అమలు చేయాలి

మాకవరపాలెం: మండలంలోని ఆన్‌రాక్(పయనీర్) భూ నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాంబాబు , మండల కార్యదర్శి బాబురావు డిమాండ్ చేశారు. భూసేకరణ సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను సుమారు 17 ఏళ్లు గడుస్తున్నా అమలు చేయకుండా యాజమాన్యం, అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. మరో వైపు ఈ రిఫైనరీని రష్యా వారికి అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. భూములు సేకరించిన సమయంలో హామీ ఇచ్చినట్టుగా ఉద్యోగాలు, రెండు సెంట్ల స్థలం, తదితర హామీలను అమలు చేయాలన్నారు. లేకుంటే నిర్వాసితులతో ఆందోళన చేస్తామన్నారు.

భారీ వర్షానికి రోడ్లపై నీరు




నాతవరంలో వర్షం కురుస్తున్న దృశ్యం

నాతవరం : మండల కేంద్రంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లపై నీరు ప్రవహించింది. దీంతో వాహనదారులతో పాటు ప్రజలు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. కాగా ఎడతెరిపి లేకుండా తరుచూ వర్షాలు పడడంతో పంట దశలో పూతతో ఉన్న నువ్వు చేను దెబ్బతింటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మోస్తరు వర్షాలతో వేసవి నుంచి ఉపశమనం

మాడుగుల రూరల్: ఈ నెల మెదటి వారం నుంచి కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడింది. ఈ నెల మెదటి వారం నుంచి ప్రతి రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ, సాయంత్రం నుంచి ఒక్కసారిగా ఆకాశం మబ్బులు పట్టి, ఒక మోస్తారుగా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో రైతులు ఖరీఫ్ పనులకు ముందస్తుగా సిద్ధం అయ్యారు. వరి నారుమడులు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. పలువురు రైతులు ఉద్యానవన పంటలు వేసేందుకు సిద్ధం అవుతున్నారు. చెరకు కార్సి తోటలకు, సరుగుడు తోటలకు ఈ వర్షాలు అనుకూలంగా ఉన్నాయి.

నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



చెర్రీస్ అలంకరణతో పోతురాజు నూకాంబిక

అనకాపల్లి: అమావాస్య సందర్భంగా సోమవారం స్థానిక గవరపాలెం అరుంధతి నగర్‌లో స్వయంభూ పోతురాజు నూకాంబిక దేవస్థానంలో అమ్మవారికి చెర్రీస్‌తో ప్రత్యేక అలంకరణ చేశారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారి ఘటం ఊరేగింపు కార్యక్రమం పురవీధుల్లో ఉత్సాహంగా నిర్వహించారు.

అనకాపల్లి విద్యార్థినికి జిల్లా ఫస్ట్ ర్యాంకు



చౌదరి గీత

అనకాపల్లి: పట్టణంలోని సాయి కుల్వంత్ కళాశాలకు చెందిన విద్యార్థిని చౌదరి గీత బీబీఏ ఫలితాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఆంధ్రా యూనివర్సిటీ ఈ నెల 24న విడుదల చేసిన డిగ్రీ ఫలితాల్లో తమ విద్యార్థిని జిల్లా స్థాయి ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందని కళాశాల కరస్పాండెంట్ ఎం.కామరాజు సోమవారం ఒక ప్రకటనలో ఆమెను అభినందించారు. రెండు సంవత్సరాలుగా బీబీఏలో తమ కళాశాల విద్యార్థులు జిల్లా ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు.

అక్రమ క్వారీలపై చర్య తీసుకోండి..



విజిలెన్స్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేస్తున్న జనసేన సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు

చోడవరం: నియోజకవర్గంలో అక్రమ క్వారీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కింజరపు ప్రభాకర్‌కు సోమవారం ఫిర్యాదు చేశామని జనసేన చోడవరం నియోజకవర్గం సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు చెప్పారు. రోలుగుంట మండలంలో రాయి క్వారీలు, చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లో అక్రమ ఇసుక, గ్రావెల్ క్వారీలు నిర్వహించి సహజ సంపదను కొందరు లూటీ చేస్తున్నారని రాజు ఆరోపించారు. ఈ అక్రమ క్వారీలపై వెంటనే దాడులు చేసి చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని ఆయన చెప్పారు. శీమునాపల్లి, జుత్తాడ, రాయపురాజుపేట, గజపతినగరం, జుత్తాడ, గవరవరం, వెంకన్నపాలెం, అంబేరుపురం, భోగాపురం, లక్కవరం ప్రాంతాల్లో ఎక్కువగా నదుల్లో అక్రమ ఇసుక క్వారీలు, కొండపై మెటల్ క్వారీలు నిర్వహిస్తున్నట్టు తమ పరిశీలనలో తేలడంతో ఎస్పీకి అన్ని వివరాలతో ఫిర్యాదు చేశామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి రథయాత్ర



మాడుగులలో భగవాన్ సత్యసాయి రథయాత్ర



దేవరాపల్లిలో సత్యసాయి రథయాత్రలో పాల్గొన్న భక్తజనం

మాడుగుల : భగవన్ సత్యసాయి 100వ జన్మదిన వేడుకల్లో భాగంగా సోమవారం రథయాత్ర నిర్వహించారు. పురవీధుల్లో అధిక సంఖ్యలో భక్తులు భజనలు చేస్తూ రథయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కర్నూరు అప్పలనాయుడు, లోవరాజు, రవిశంకర్, కె. శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, పి.బలరామ్, కె. రాజుకొండ పాల్గొన్నారు.

దేవరాపల్లి: దేవరాపల్లికి భగవాన్ సత్యసాయి ప్రేమ రథయాత్ర సోమవారం సాయంత్రం చేరుకుంది. మహేశ్వరీ థియేటర్ నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా స్థానిక సత్యసాయి ధ్యాన మందిరానికి చేరుకున్న సత్యసాయి రథయాత్రకు భక్తులు అడుగడుగునా పూజలు చేస్తూ ఘన స్వాగతం పలికారు. స్థానిక ధ్యాన మందిరంలో పూజా కార్యక్రమాలు అనంతరం కె.కోటపాడు మండలానికి రథయాత్ర బయలుదేరింది. బాబా నామ స్మరణంతో దేవరాపల్లి మారుమోగింది. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కోరెడ్డి అప్పలనాయుడు, జోన్ ఇంచార్జ్ రవిశంకర్, రమామణి పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణ



మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణ



రావికమతం మండల పరిషత్ కార్యాలయంలో యోగా చేస్తున్న అధికారులు,ఉద్యోగులు

మాడుగుల : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని యోగా నిపుణులు చెబుతున్నారని, ఎంపీడీవో కొంకి అప్పారావు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగా దినోత్సవ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 26వ తేదీ నుంచి జూన్ 20వ తేదీ వరకు సచివాలయాల్లో యోగా శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో యోగా మాస్టర్స్ ఎం.జనార్దనరావు, కె.హైమావతి, ప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు, ఉద్యోగులకు యోగా శిక్షణ

రావికమతం : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అధికారులు, ఉద్యోగులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, ఇతర శాఖల ఉద్యోగులకు యోగాపై శిక్షణ నిర్వహించి అనంతరం ఎంపీడీవో కె.వెంకన్నబాబు, ఈవోపీఆర్డీ భానోజీరావు, మండల పరిషత్ ఏవో సీతారామస్వామి, ఎంఈవో-2 బ్రహ్మాజీ తదితరులు యోగాసనాలు వేశారు. యోగాకు సంబంధించి ప్రతి గ్రామ పంచాయతీ నుంచి 200 మందిని రిజిస్టర్ చేయించాలని ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు.